ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 28.0 | కనిష్ఠం : 17.0

ANDHRAJYOTHY

5



మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

బుధవారం 3 జనవరి 2024



రూ.296 కోట్లు తాగేశారు



- గత నెలలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మద్యానికి చేసిన ఖర్చు ఇది
- గతేడాది కన్నా రూ.50 కోట్లు అదనం
- మహబూబ్‌నగర్ జిల్లాలోనే రూ.125 కోట్లు..

మహబూబ్‌నగర్, జనవరి 2: ఉమ్మడి జిల్లాలో మద్యాన్ని మంచి నీళ్లలా తాగేస్తున్నారు. ఒక్క నెలలోనే రూ.295.60 కోట్ల విలువైన మద్యం తాగారంటే అమ్మకాలు ఏ మేర సాగుతున్నాయో తెలుసుకోవచ్చు. ఊరూరా మద్యం ఏరులై పారుతోంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ కలిసి మద్యం తాగుతూ జల్సా చేస్తున్నారు. ఏ చిన్న అకేషన్ దొరికినా చుక్క పడాల్సిందే. ఇదివరకు పండగలు, పబ్బాలు, శుభకార్యాలకు మాత్రమే తాగేవారు. కానీ ఇప్పుడు రోజూ మద్యం తాగడం అలవాటుగా మారింది. అందుకే మద్యం విక్రయాలు ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయి. మందు తాగే వారి సంఖ్య కూడా అంతకంతకు పెరుగుతూనే ఉంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గత డిసెంబరు 31 రోజుల్లో రోజూ సగటున దాదాపు రూ.10 కోట్ల విలువైన మద్యం తాగారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆ నెల మొత్తం రూ.295.60 కోట్ల విలువైన మందు తాగారు. గతేడాది డిసెంబరులో రూ.245.49 కోట్ల మద్యం విక్రయాలు జరుగగా, ఈ ఏడాది రూ.50 కోట్లు అధికంగా విక్రయాలు జరిగాయి. మద్యం తాగేవారి సంఖ్యతో పాటు మద్యం సేవించే మోతాదు కూడా మించడం వల్ల ఈ స్థాయిలో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. డిసెంబరు నెలలో ఉమ్మడి జిల్లాలో 3,11,868 కేసుల లిక్కర్, 3,57,152 కేసుల బీర్లు విక్రయించారు. ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్ జిల్లాలోనే అత్యధికంగా విక్రయాలు జరిగాయి. మొత్తం విక్రయాల్లో 42 శాతం విక్రయాలు ఈ జిల్లాలోనే సాగడం గమనార్హం. ఇక్కడ రూ.125.52 కోట్ల మద్యం సేల్స్ జరిగాయి. అదే గతేడాది డిసెంబరులో జిల్లాలో రూ.102.50 కోట్ల విక్రయాలు జరగగా, ఈ ఏడాది రూ.23 కోట్ల విక్రయాలు ఎక్కువ అయ్యాయి. ఇక డిసెంబరు 31న అన్ని మద్యం దుకాణాల నుంచి భారీగా విక్రయాలు చేశారు. ఉమ్మడి జిల్లాలో రెగ్యులర్‌గా విక్రయించే మదానికి రెండింతల విక్రయాలు జరగడం గమనార్హం.

బెల్ట్ దుకాణాలతో పెరుగుతున్న సేల్స్

మద్యం సేల్స్ పెరగడానికి బెల్ట్ దుకాణాలే ప్రధాన కారణం. ఒక్కో మద్యం దుకాణం నుంచి పెద్ద ఎత్తున బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. గ్రామాల్లోని గల్లీకో బెల్టు దుకాణం ఉండటం వల్ల కూడా సేల్స్ పెరగడానికి కారణమవుతోంది. బెల్ట్ దుకాణాలను కట్టడి చేస్తే సేల్స్ చాలావరకు తగ్గే అవకాశం ఉండటంతో అధికారులు పరోక్షంగా ఆ దుకాణాలను ప్రోత్సహిస్తున్నారు. అదే విధంగా వైన్స్ పక్కన ఉండే పర్మిట్ గదులు బార్‌లను తలపిస్తున్నాయి. పది బై పది ఉండాల్సిన పర్మిట్ గదులు వందల గజాల స్థలాల్లో విస్తరించడం కూడా మద్యం సేల్స్ పెరుగుదలకు కారణమవుతున్నాయి.

15 శాతం పెరుగుదల



గద్వాల క్రైం: జోగుళాంబ గద్వాల జిల్లాలో 36 మద్యం దుకాణాలు, ఏడు రెస్టారెంట్లు ఉన్నాయి. జిల్లాలో గత జనవరి నుంచి నవంబరు దాకా 20 శాతం అధికంగా మద్యం అమ్మకాలు జరుగగా, ఒక్క డిసెంబర్ నెలలోనే 15.64 శాతం అధికంగా విక్రయాలు జరిగాయని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. బెల్టు దుకాణాల ద్వారా కూడా విచ్చల విడిగా అమ్మకాలు జరిగాయి. జిల్లాలో 2022 డిసెంబరులో రూ.43.01 కోట్ల మద్యం విక్రయాలు జరుగగా, 2023 డిసెంబరులో రూ.49.74 కోట్లు విక్రయాలు జరిగాయి. 2022 డిసెంబరు కంటే 2023 డిసెంబరులో లిక్కర్, బీర్ల అమ్మకాలు ఎక్కువగా అమ్ముడుపోయాయని గద్వాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు తెలిపారు.

అనిరుధ్‌రెడ్డి భిన్నశైలి

- జడ్చర్ల ఎమ్మెల్యే సంచలన నిర్ణయాలతో సర్వత్రా చర్చనీయాంశం
- ఎస్కార్ట్ వద్దంటూ డీజీపీకి, ఎస్పీకి లేఖ
- ఇతర పార్టీల నుంచి వస్తామనేవారికీ నో చెప్పిన నాయకుడు



జోగుళాంబ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌ను కలిసి తనకు పోలీస్ ఎస్కార్ట్ అవసరం లేదని లేఖ అందిస్తోన్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కొత్త ఒరవడికి తెరలేపారు. నియోజవర్గ ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల కోసం పని చేయాల్సిన బాధ్యత తనపై ఉందే తప్ప, ప్రజల కంటే తాను అతీతుడను కాదని పేర్కొంటున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన మరునాటి నుంచే తనదైన మార్కును ప్రదర్శిస్తూ చర్చకు దారితీశారు. తాజాగా పోలీసు ఎస్కార్ట్ వాహనాల బందోబస్తు తనకు అవసరం లేదని రాష్ట్ర డీజీపీకి, మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్‌కు మంగళవారం లేఖలు రాసి, సంచలనం సృష్టించారు. తనకిప్పటికే ప్రభుత్వం తగిన స్థాయిలో గన్‌మెన్‌తో భద్రత ఇచ్చిందని, అంతకుమించి తనకు రక్షణ అవసరం లేదని పేర్కొన్నారు. వారం నుంచి నియోజకవర్గంలో ఎక్కడికి వెళ్లినా సంబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి ఎస్కార్ట్ వాహనం తన వెంట పంపుతున్న విషయం గమనించానని, ఆ భద్రత తనకు అవసరం లేదని, పోలీసులు ప్రజల భద్రతకు, వారివద్దకు వచ్చే కేసులు పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

నియోజకవర్గంలోని ఐదు జూనియర్ కాలేజీల్లో చదువుకుంటున్న 1,300 మంది విద్యార్థులకు అనిరుధ్‌రెడ్డి బుధవారం నుంచి సొంత ఖర్చులతో మధ్యాహ్న భోజనం అందించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు, నిర్వాహకులకు ఆదేశాలిచ్చారు.

ఇసుక అక్రమ రవాణాపై..

నియోజకవర్గంలో ఇసుక మాఫియాపై అనిరుధ్‌రెడ్డి మొదటి రోజే యుద్ధం ప్రకటించారు. జీవనది లాం టి దుందుభీ నుంచి అక్రమంగా ఒ క్క ఇసుక రేణువును తరలించినా, ఫిల్టర్ ఇసుక ఎక్కడ తయారు చే సినా పోలీసులకు పట్టించాల ని చెప్పారు. నేరుగా తనకు ఫోన్ చేయొచ్చన్నారు. దీంతో 20 రోజులుగా నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా ఆగింది. ఫిల్టర్ ఇసుక కేంద్రాలపై దాడులు చేసి, ధ్వంసం చేశారు.

అనిరుధ్‌రెడ్డి మొదటిసారే ఎమ్మెల్యేగా గెలిచినా రాజకీయ పరంగా కీలకమైన నిర్ణయాలను అమలు చేస్తుండటం గమనార్హం. నియోజకవర్గంలో పదవుల కోసమో, పైరవీల కోసమో, అక్రమాలకు మద్దతు కోసమో ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకులను చేర్చుకునేదిలేదని తేల్చి చెప్పారు. తాను ఎమ్మెల్యే అవగానే

వలసదారులకు నో..

ఇతర పార్టీల నాయకులు ఫోన్లు చేసి శుభాకాంక్షలు చెబుతూ, తాము వస్తామని రాయబారాలు చేస్తున్నారని, కానీ తనకు తన కోసం కష్టపడ్డ కార్యకర్తలు, తనను నమ్మి గెలిపించిన ప్రజలే ముఖ్యమని చెప్పారు. వారికోసమే తాను పని చేస్తానని, ఇతర పార్టీల నుంచి వచ్చేవారు అవసరం లేదని తేల్చిచెప్పారు. తన కోసం కష్టపడ్డ యువతనే రాజకీయ నాయకులుగా తీర్చిదిద్దుతానని, తనకు అవకాశమిచ్చిన వారి రుణం తీర్చుకుంటానని అనిరుధ్‌రెడ్డి పేర్కొంటుండటం రాజకీయంగా రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారితీసింది.

గట్టుకు గండం

- వనపర్తి మునిసిపల్ చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌పై అవిశ్వాసానికి రెడీ
- సొంత పార్టీ బీఆర్ఎస్‌లోనే అసమ్మతి గళం
- ఇబ్బంది కాకుండా కాంగ్రెస్ మద్దతు కోరిన నాయకులు
- సొంత పార్టీ కౌన్సిలర్లతో రాజీకి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సమావేశం



వనపర్తి మునిసిపల్ కార్యాలయం

వనపర్తి, జనవరి 2(ఆంధ్రజ్యోతి): వనపర్తి మునిసిపాలిటీలో అవిశ్వాస తీర్మానానికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టి.. కొత్త చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకోనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ పరిణామం బీఆర్ఎస్‌లో అలజడి రేపుతుండగా.. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి కౌన్సిలర్లను బుజ్జగించి, రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం కౌన్సిల్‌లో బీఆర్ఎస్‌కు ఫుల్ మెజారిటీ ఉంది. మునిసిపల్ ఎన్నికలకు మరో ఏడాది సమయం కూడా ఉంది. ఇటీవల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించగా.. ఇతర పార్టీల నుంచి చేరికలను ఎక్కువగా ప్రోత్సహించబోమని ఆ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. అయితే కొన్నాళ్లుగా వనపర్తి మునిసిపాలిటీలో చైర్మన్ గట్టు యాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్‌పై సొంత పార్టీ నాయకుల్లోనే అసంతృప్తి ఉంది. గతంలో కూడా ఓ మారు వీరికి వ్యతిరేకంగా కౌన్సిలర్లు సమావేశాలు నిర్వహించుకున్నారు. అప్పుడు పార్టీ అధికారంలో ఉండటం.. అప్పటి మంత్రి నిరంజన్‌రెడ్డి కూడా రాజీ కుదర్చడంతో వివాదానికి తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. అయితే మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మునిసిపాలిటీలో కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ వచ్చింది. బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు ఎవరూ మనస్ఫూర్తిగా పని చేయలేదనే విమర్శలు కూడా వచ్చాయి. పార్టీ అధికారంలోకి రాకపోవడం, స్థానికంగా ఎమ్మెల్యే స్థానం కూడా దక్కకపోవడంతో ఇదే అదునుగా అసంతృప్త నాయకులు మళ్లీ బయటకు వచ్చి, అసమ్మతి రాగాన్ని వినిపిస్తున్నారు. ఇటీవల పలుమార్లు సమావేశమై.. చైర్మన్, వైస్ చైర్మన్లను దించి అదే సామాజిక వర్గ కూర్పుతో కొత్తవారిని ఎన్నుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. అయితే ఈ విషయం ముందుగా పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లకుండా కాంగ్రెస్ నాయకులను సంప్రదించారు. తాము చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెడతామని, తమకు సహకరించి.. కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలిపాలని కోరినట్లు తెలుస్తోంది. కొత్త చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికైన తర్వాత పూర్తిగా కాంగ్రెస్‌లో కలవడానికి కూడా సంసిద్ధత వ్యక్తం చేసినట్లు సమాచారం.

ఎందుకీ వ్యతిరేకత..

మునిసిపాలిటీలో గడిచిన నాలుగేళ్లలో పాలన ఏకపక్షంగా సాగిందని, తమ నిర్ణయాలను, అభిప్రాయాలను పాలకవర్గం ఏ మాత్రం పట్టించుకోకుండా వ్యవహరించిందనే విషయంలో కౌన్సిలర్లు ప్రధానంగా ఆగ్రహంగా ఉన్నారు. నిధులు, పనులు, బిల్లులు, గౌరవం విషయంలో కూడా తమను చిన్నచూపు చూశారనే ఆవేదనతో ఉన్నారు. అలాగే కొందరి అవినీతి వల్ల అందరికీ చెడ్డపేరు వచ్చిందని, తమ వార్డుల్లో తమను కాదని ఏకపక్షంగా పనులు చేయడం వల్ల తమకు గౌరవం లేకుండా చేశారనే అభిప్రాయం వారిలో ఉంది. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు, రిజిస్ట్రేషన్ ఆఫీసుకు శంకుస్థాపన, రోడ్ల విస్తరణలో కొందరి నుంచి డబ్బుల వసూలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీల మంజూరు ఇలా అనేక విషయాల్లో ఇబ్బందులు పడ్డామని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మునిసిపాలిటీలో కాంగ్రెస్‌కు మెజారిటీ రావడానికి కూడా కొందరు మా త్రమే కారణమని భావిస్తున్నట్లు సమాచారం. పాలకవర్గంపై గతంలో నుంచే అసంతృప్తిగా ఉన్నప్పటికీ.. నాలుగేళ్ల వరకు అవిశ్వాసం పెట్టడానికి వీలు లేకపోవడంతో ఇన్నాళ్లు ఆగినట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ నాయకులు కూడా ఆ అసంతృప్తికి ఆజ్యం పోస్తున్నారు. అవిశ్వాసంలో తాము మద్దతు తెలుపుతామని హామీ ఇవ్వడంతో పాటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు నిర్ణయం మార్చుకోకుండా ఉండేందుకు ప్రయత్నిస్తున్నారు.

రాజీ చర్చలు ఫలిస్తాయా?

తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడింది. ఆ సమయంలోనే జరిగిన మునిసిపాలిటీ ఎన్నికల్లో స్థానికంగా టీడీపీ కౌన్సిల్ గెలిచింది. కానీ చైర్మన్ సహా మెజారిటీ కౌన్సిలర్లు పార్టీ మారడంతో బీఆర్ఎస్ కౌన్సిల్‌ను దక్కించుకున్నట్లయ్యింది. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. స్థానికంగా ఎమ్మెల్యేగా కూడా ఆ పార్టీ అభ్యర్థినే గెలిచారు. దాంతో పట్టణంలో బీఆర్ఎస్‌లో అసమ్మతిని రాజేయడం ద్వారా ఆ పార్టీ కేడర్ విశ్వాసాన్ని దెబ్బతీయాలని కొందరు కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నారు. అందుకే కాంగ్రెస్‌లో చేరేందుకు కొందరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు వెళ్లినా.. ఇప్పుడే వద్దని చెప్పారు. ఎన్నికల ముంగిట ఆ పార్టీ బలం కోల్పోయేట్లు చేసి, వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందవచ్చని సదరు నాయకులు భావిస్తున్నారు. దీన్ని గమనించి మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు. మొదట సమావేశం నిర్వహించిన నిరంజన్‌రెడ్డి.. వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినట్లుగా సమాచారం. కానీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను మార్చాలని కౌన్సిలర్లు పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అవిశ్వాసానికి తాత్కాళిక బ్రేకులు వేసినట్లుగా ప్రచారం జరుగుతున్నప్పటికీ.. సంక్రాంతిలోపు కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రవేశపెడతారనే అభిప్రాయం ఉంది. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి కూడా కౌన్సిలర్లతో మాట్లాడనున్నట్లు తెలుస్తోంది. వారి రాజీ ప్రయత్నాలు ఫలిస్తాయా? లేదా అనేది వేచిచూడాలి. ఇదిలా ఉంటే అసమ్మతి కౌన్సిలర్లకు మరింత ఊతం ఇచ్చేలా కాంగ్రెస్ నాయకులు కార్యాచరణ సిద్ధం చేశారు. నేరుగా చైర్మన్‌ను టార్గెట్‌గా పాత వసూళ్లను బయటకు తీస్తుండటంతో వనపర్తి పురపాలికలో చర్చ జరుగుతోంది.

పెట్రోల్ బంకుల్లో బారులు



మహబూబ్‌నగర్‌లోని ఓ బంక్ వద్ద పెట్రోల్, డీజిల్ కోసం డబ్బాలతో బారులు తీరిన వాహనదారులు

మహబూబ్‌నగర్, జనవరి 2: ట్రక్కు డ్రైవర్లు రోడ్డు ప్రమాదానికి కారణమై, పోలీసులకు సమాచారం ఇవ్వకుండా పరారైతే వారికి పదేళ్ల జైలు శిక్ష, రూ.ఏడు లక్షల జరిమానా విధించాలని తెచ్చిన చట్టాలను నిరసిస్తూ ట్రక్కు డ్రైవర్లు మూడు రోజుల సమ్మెకు పిలుపు ఇచ్చినట్లు మంగళవారం ప్రచారం జరిగింది. ట్రక్కులు ఆగిపోతే పెట్రోల్, డీజిల్ దొరకదన్న ఉద్దేశంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు బంక్‌ల వద్ద వాహనదారులు బారులు తీరారు. మూడు రోజులకు సరిపోను ఆయిల్ పోయించుకునేందుకు డబ్బాలు చేత పట్టుకుని లైన్లలో నిలబడ్డారు. కాగా, తాము ఎలాంటి నిరసనకు పిలుపు ఇవ్వలేదని, సోషల్ మీడియాలో వచ్చిన సమాచారాన్ని నమ్మొద్దని తెలంగాణ ఆయిల్ ట్యాంకర్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ ప్రకటించారు.

ఆ బైక్ ఎవరిది?

- మానవపాడు వద్ద ఆర్డీఎస్ కాలువలో నెల రోజులుగా ద్విచక్ర వాహనం
- కెనాల్‌లో నీటి ప్రవాహం తక్కువగా ఉన్నప్పుడు కనిపిస్తున్న వాహనం
- బయటికి తీసి దర్యాప్తు చేస్తామన్న ఎస్ఐ



ఆర్డీఎస్ కాల్వలో కనిపిస్తున్న బైక్

మానవపాడు, జనవరి 2: జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రం నుంచి జాతీయ రహదారికి వెళ్లే దారిలో ఆర్డీఎస్ మెయిన్ కెనాల్‌లో నెల రోజులుగా బైక్ పడి ఉంది. కెనాల్ నీటి ప్రవాహం తగ్గినప్పుడు బైక్ కన్పిస్తుందని, ప్రవాహం ఎక్కువ ఉన్నప్పుడు కనిపించడం లేదని ప్రజలు చెబుతున్నారు. వాహనం నంబర్ కనిపిస్తుందని, నెల రోజులుగా బైక్ కాల్వలో ఉన్నా ఇప్పటి వరకు ఎవరూ రావడం లేదని అంటున్నారు. బైక్ కాల్వలో ప్రమాదవశాత్తు పడిందా? లేక ఉద్దేశపూర్వకంగా పడేశారా? అన్నది తేలాల్సి ఉంది. ఈ విషయమై ఎస్సై రామును సంప్రదించగా బైక్‌ను కాలువలో నుంచి తీసి, దర్యాప్తు చేస్తామని తెలిపారు.

సైన్స్ సదస్సుకు ఉపాధ్యాయుడు



ఉపాధ్యాయుడు శ్రీధర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం/ నవాబ్‌పేట, జనవరి 2 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం యన్మనగండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీధర్ అంతర్జాతీయ సైన్స్ సదస్సుకు ఎంపికయ్యారు. దేశ రాజధాని న్యూఢిల్లీ సమీపంలోని ఫరీదాబాద్‌లో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు కేంద్రం, హర్యానా ప్రభుత్వాలు, విజ్ఞాన భారతి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సులో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ భౌతిక శాస్త్రం పద్ధతులు, ప్రయోగాలపై దేశ వ్యాప్తంగా ఎంపిక చేసిన 300 మంది ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్‌గా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆయన ఎంపిక పట్ల మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్, హెచ్‌ఎం వనజ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో రెండు కరోనా కేసులు

» అందులో ఒకరు 8 నెలల గర్భిణి

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జనవరి 2 : జిల్లాలో కరోనా మరోసారి కలకలం సృష్టిస్తోంది. వారంరోజులుగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కరోనా ఆర్‌టీపీసీఆర్ టెస్టులు చేస్తుండటంతో రోజుకో కేసు చొప్పున నమోదవుతున్నాయి. తాజాగా మంగళవారం మరో రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. అందులో జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఓ ఎనిమిది నెలల గర్భిణీ ఉన్నారు. ఆమె జ్వరం, దగ్గు, జలుబు లక్షణాలతో ఆసుపత్రికి వచ్చి పరీక్ష చేయించుకోగా కరోనా అని నిర్ధారించారు. అదే విధంగా భూత్పూర్ మండలం పాత మొల్గరకు చెందిన ఓ 35 ఏళ్ల వ్యక్తికి కరోనా నిర్ధారణ అయ్యింది. ఇతను జాతర్లలో పనిచేస్తుంటాడు. దేవరకద్ర మండలం చిన్నరాజమూరు, మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని రాంచంద్రాపూర్‌లలో నిర్వహించిన జాతర్లలో పనిచేశాడు. వారంరోజులుగా తీవ్ర జ్వరం, జలుబు, దగ్గు ఉండటంతో జనరల్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోగా కోవిడ్ అని నిర్ధారించారు. అయితే ఈయనతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆరుగురు ఉంటారు. కానీ, ఉండటానికి రెండు గదులే ఉండటంతో అందరికీ వైరస్ సోకే పరిస్థితి ఉంది. కావున వైద్యాధికారులు ఆ కుటుంబంపై దృష్టి సారించాలని గ్రామస్థులు కోరారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ వారం రోజుల్లోనే ఏడు కేసులు నమోదు కావడంతో ప్రజల్లో కొంత ఆందోళన నెలకొన్నది. ఈ పరిస్థితుల్లో వైరస్ వ్యాప్తి చెందకుండా వైద్య ఆరోగ్య శాఖ తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నిరుపయోగంగా క్రీడా మైదానాలు

» వినియోగంలోకి తేవాలంటున్న క్రీడాకారులు

» మందుబాబులకు అడ్డాగా మారిన క్రీడా ప్రాంగణాలు



ద్యాగదొడ్డిలో నిరుపయోగంగా ఉన్న క్రీడా ప్రాంగణం

ధరూరు, జనవరి 2 : గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రతీ గ్రామంలో ఒక క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసింది. కాగా, అవి ఏ గ్రామంలో చూసినా మైదానాలు ఉపయోగంలోకి రాకుండా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. దీంతో క్రీడా ప్రాంగణాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. ధరూరు మండల పరిధిలో ప్రస్తుతం 26 గ్రామ పంచాయతీలకు గాను ప్రతీ గ్రామంలోనూ క్రీడా మైదానాలు ఏర్పాటయ్యాయి. కాగా, కొన్ని గ్రామాలకు దూరంగా మైదానాలు ఉండటంతో క్రీడాకారులు అటుగా వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ఖాళీ ప్రాంగణం ఎక్కడ ఉంటే అక్క డ క్రీడా ప్రాంగణం బోర్డు ఏర్పాటుచేయడం, క్రీడాకారులకు అనువుగా స్థలం లేకపోవడంతో క్రీడాకారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. దీంతో క్రీడాకారులు క్రీడా మైదానం వైపు వెళ్లేందుకు అనాసక్తి చూపిస్తున్నారు. కొన్ని ప్రాంగణాల్లో ఆటలకు అనువుగా లేకపోవడం, స్థలం చదునుతో పాటు, సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో అవి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. క్రీడాకారులు కోసం నిర్మించిన మైదానాలు ఎందుకూ పనికి రాకుండా ఉండటంతో మండల ప్రజలు, క్రీడాకారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఈ క్రీడా మైదానాలపై దృష్టి సారిస్తాయా లేదా అన్న సందిగ్ధత నెలకొంది.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మైదానాల ఎంపిక

క్రీడాకారుల కోసం క్రీడా ప్రాంగణం కోసం ఎకరా స్థలం నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ గ్రామాల్లో స్థలం కొరతతో అధికారులు పది కుంటల స్థలాన్ని గుర్తించి క్రీడా మైదానాలు నిర్మాణాలు చేపట్టారు. అందులో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడలు ఆడేందుకు స్థలాన్ని కేటాయించారు. దీంతో ఏగ్రామంలో చూసినా అవి నిరుపయోగంగా ఉండటంతో క్రీడాకారులు తీవ్ర నిరాశకు గురిచేసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాలు ఉపయోగంలోకి తీసుకురావాలని క్రీడాకారులు కోరుతున్నారు.

46 సంచుల వడ్లు చోరీ

చిన్నంబావి, జనవరి 2: వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని పెద్దదగడ గ్రామానికి చెందిన జింకల వీరయ్యకు చెందిన 46 (70కిలోల) బస్తాల ఆర్ఎన్ఆర్ వడ్లు దొంగలు ఎత్తుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. జింకల వీరయ్య ఆర్ఎన్ఆర్ రకం వడ్లు గ్రామ సమీపంలో ఆరబెట్టారు. సోమవారం ఆ వడ్లను మిల్లు తీసుకెళ్దామని సంచులకు నింపాడు. సంచులు తీసుకెళ్లేందుకు ఆటో రాకపోవడంతో అక్కడే ఉంచి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి ధాన్యం కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ కృష్ణ ఓబుల్ రెడ్డి తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

చిన్నంబావి, జనవరి 2: బైక్ అదుపుతప్పి యువకులు గాయపడిన సంఘటన మంగళవారం వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని వెలుగొండ గ్రామ సమీపంలో మూల మలుపు వద్ద చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పెద్దమారూర్ గ్రామానికి చెందిన మొక్కలపల్లి శివ, వంశీ, పగిడాల వంశీ, మొక్కలపల్లి చెందిన యువకులు ముగ్గురు బైక్‌పై పెబ్బేరు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా వెలుగొండ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వారిని పెబ్బేరు ఆస్పత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని..

ఆత్మకూరు : ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇరువురికి గాయాలైన సంఘటన అమరచింత, పామిరెడ్డిపల్లి గ్రామాల రహదారిపై చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పామిరెడ్డిపల్లికి చెందిన మల్లేష్, స్వాతిలు బైక్‌పై గ్రామం నుంచి ఆత్మకూరుకు వెళ్తున్నారు. అదే క్రమంలో శ్రీరాములు అనే వ్యక్తి తమ ద్విచక్ర వాహనంపై పామిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. గ్రామ శివారులోని మలుపు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టుకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. క్షతగాత్రులను పాలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో నిత్యావసర వస్తువులు చోరీ

ధరూరు, జనవరి 2 : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం మన్నాపురం ప్రభుత్వ పాఠశాలలో నిత్యావసర వస్తువులు చోరీకి గురయ్యాయి. పాఠశాలకు వరుసగా ఆదివారం, సోమవారం సెలవులు రావడంతో పాఠశాల వంటగదికి తాళం వేశారు. తిరిగి మంగళవారం పాఠశాల పునఃప్రారంభం కావడంతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వంట గది వద్దకు వెళ్లి చూడగా తాళం పగులగొట్టి కన్పించింది. గదిలో ఉన్న కంది బ్యాళ్లు, మంచినూనె, బియ్యం తదితర సామగ్రి చోరీకి గురైనట్లు హెచ్‌ఎం యోగేందర్ తెలిపారు. గతంలో కూడా పాఠశాలకు సెలవులు రావడంతో తలుపులు విరగ్గొట్టి లోపల ఉన్న సీలింగ్ ఫ్యాన్లు, బెంచీలు, తలుపులు తదితర వాటిని చోరీ చేశారన్నారు. పాఠశాలలో నిత్యావసరాల చోరీపై స్థానిక పోలీసులకు సమాచారం అందించామని హెచ్‌ఎం తెలిపారు.

జాతీయ రహదారిపై బొలెరో వాహనం బోల్తా



రహదారిపై బోల్తా పడిన బొలెరో వాహనం

రాజాపూర్, జనవరి 2 : మండల పరిధిలోని 44వ జాతీయ రహదారి మంగళవారం హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు వెళ్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడిన సంఘటన చోటు చేసుకుంది. ప్రమాదంలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే అప్రమత్తమైన స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను ఓ వైపు నుంచి మళ్లించడంతో జాతీయ రహదారిపై ప్రజలందరు సాఫీగా ప్రయాణం కొనసాగించారు.

మెగా కంపెనీలో కేబుల్ అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 2 : నాగర్‌కర్నూల్ మండలంలోని కుమ్మెర గ్రామంలో మెగా కంపెనీలో రూ. 2.50లక్షలు విలువ గల కేబుల్ అపహరణకు గురైనట్లు ఎస్ఐ మహేందర్ మంగళవారం తెలిపారు. కంపెనీలో విలువైన 5-కోరు మిక్స్‌డ్ వైరు గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి అపహరణకు గురైనట్లు ఆయన తెలిపారు. ఈ ఘటనపై కంపెనీ నిర్వాహకుడు పులేందర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఐటీఐ కళాశాలలో దొంగతనం

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 2 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నేషనల్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఐటీఐలో గుర్తు తెలియని దుండగులు దొంగతనానికి పాల్పడినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. బోరు మోటార్లు 5హెచ్‌పీ, 10హెచ్‌పీలకు సంబంధించిన కాపర్ వైరు, మోటార్లకు సంబంధించిన వీడి భాగాలు, ఫ్యాన్లు, ఒక కంప్యూటర్ అప హరించుకుని వెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ సంఘటనపై ప్రిన్సిపాల్ సమీవుల్లాఖాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 2 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డుకాలనీకి చెందిన సాయిబాబు యూనికాన్ వాహనం గుర్తు తెలియని దుండగులు అపహరించుకుని వెళ్లాడు. బాధితుడి వివరాల ప్రకారం... సోమవారం ఉదయం తెల్లవారుజామున బయటి నుంచి తాను వచ్చి మెయిన్ రోడ్డులో గల తన ఇంటి దగ్గర పార్కు చేసి ఇంట్లోకి వెళ్లి వచ్చే వరకు వాహనం అపహరణకు గురైనట్లు పేర్కొన్నారు. తన వాహనం నాగర్‌కర్నూల్ పట్టణంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో ఎక్కడా వెతికినా ఆచూకీ లభించలేదన్నాడు. బైక్ అపహరణపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

దాడి సంఘటనలో కేసు నమోదు

వెల్దండ, జనవరి 2 : నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం అజిలాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన దాడి సంఘటనలో పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన గునుగంటి శంకర్ అనే వ్యక్తికి చెందిన బంధువుల వివాహం సందర్భంగా బరాత్ నిర్వహించారు. డీజే సౌండ్ పెట్టడంతో గ్రామానికి చెందిన పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో జరిగిన గొడవలో శంకర్, అతడి అనుచరులపై గ్రామానికి చెందిన చంద్రయ్య, రమేష్, ఆనంద్, నర్సింహ, యాదయ్య, జ్యోతి దాడిచేసి గాయపర్చారు. ఈ మేరకు శంకర్ ఫిర్యాదుతో పోలీసులు కేసునమోదు చేశారు.

జాతీయ స్థాయి అడ్వెంచర్ క్యాంపునకు ఎంవీఎస్ కళాశాల విద్యార్థి ఎంపిక

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 2 : హిమాచల్ ప్రదేశ్‌లో ఈ నెల 8 వరకు జరగనున్న జాతీయ స్థాయి అడ్వెంచర్ క్యాంపునకు జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్-5 విద్యార్థి నవీన్‌కుమార్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ శివలీల, సత్యనారాయణగౌడ్, ఈశ్వరయ్య, నాగరాజాచారిలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమికి 9,000 అడుగుల ఎత్తులో ఉన్న నార్కండలో ట్రెక్కింగ్, రాఫెలింగ్, వ్యాలీక్రాసింగ్‌కు వాలంటీర్లకు శిక్షణ ఇవ్వడం సంతోషించదగ్గవిషయం అన్నారు. కళాశాల విద్యార్థి జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

వికటించిన ఆర్ఎంపీ వైద్యం

- తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో చికిత్స



కాళ్లకు కాలినట్లుగా గాయాలు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జనవరి 2: ఆర్ఎంపీలు తమ పరిమితికి మించి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఇందుకు సాక్ష్యం ఇటీవల మహ్మదాబాద్‌లో జరిగిన సంఘటన. బాధితుడి తమ్ముడు పాండు నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహ్మదాబాద్ మండలం మంగంపేట తండాకు చెందిన జాన్యనాయక్ గత డిసెంబరు 23న తీవ్ర జ్వరం, ఒళ్లునొప్పులు ఉండడంతో మండల కేంద్రంలోని ఆర్ఎంపీ నారాయణరెడ్డి వద్దకు వెళ్లి చూపించు కున్నాడు. పరీక్షించిన ఆర్ఎంపీ కొన్ని మందులు, ఇంజక్షన్ ఇచ్చాడు. ఇచ్చిన అరగంటలోపు వాంతులు రావడంతో మళ్లీ అతని వద్దకే వెళ్లి అడిగాడు. ఏం కాదు అన్ని తగ్గుతాయి అని ఆర్ఎంపీ బాధితుడికి నచ్చజెప్పి పంపించాడు. రాత్రి వరకు పరిస్థితి విషమంగా మారింది. ఒళ్లంతా కాలిన గాయాల మాదిరిగా తయారైంది. మొహంపై కాలిన గాయాలు ఉండడం, తీవ్ర కడుపునొప్పి రావడంతో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్, మందుల డోసు ఎక్కువగా ఉందని, అందువల్లనే ఈ పరిస్థితి వచ్చిందని చెప్పి హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. హుటాహుటిగా బాధితున్ని హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం అతని పరిస్థితి కొంత మెరుగ్గా ఉందని బాధితుడి తమ్ముడు తెలిపాడు. ఇదే విషయమై ఆర్ఎంపీ నారాయణరెడ్డిని వివరణ కోరగా తాను ఇంజక్షన్, మందులు ఇచ్చిన మాట వాస్తవమే. కానీ, అతనికి అలా ఎందుకు జరిగిందో నాకు తెలియదని చెప్పారు. ఇదిలా ఉండగా వైద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వలన ఆర్ఎంపీల ఆగడాలు పెరుగుతున్నా యని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

కేజీబీవీల పర్యవేక్షణ కరువు

- జీసీడీవో పోస్టు కోసం జోరుగా పైరవీలు

- కేజీబీవీలో విద్యార్థులను కొట్టిన సీఆర్టీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 2 : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ల్లో పర్యవేక్షణ కొరవడింది. దీంతో జిల్లాలోని కేజీబీవీలో ప్రత్యేక అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా తయారైంది. విద్యార్థులకు నిత్యం అందించాల్సిన మెనూ సరిగా అందడంలేదు. వారం రోజుల కిందట జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ కేజీబీవీలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందలేదని విద్యార్థులు అసహనం వక్తం చేశారు. అదే సమయంలో అక్కడికి ఓ జిల్లా అధికారి పర్యవేక్షణకు కూడా వెళ్లగా విద్యార్థులకు పూర్తి స్థాయిలో మెనూ పాటించలేదని తెలిసింది. దీంతో అక్కడి సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోమారు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందలేదన్న ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇదే పరిస్థితి అన్ని కేజీబీవీలలో నెలకొంది. ఆరు నెలలుగా కేజీబీవీలను పర్యవేక్షించే అధికారి లేకపోవడంతో అటు వైపు అధికారులు చూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మీ ఇంటి వద్ద ఇంతకన్నా మంచిగా ఉంటుందా !

విద్యార్థులు భోజనం బాగోలేదని అడిగితే మీ ఇంటిదగ్గర ఇంతకన్నా మంచిగా ఉంటుందా, మంచి భోజనం తింటే ఇక్కడికి ఎందుకు వచ్చారు.. అంటూ అక్కడ పనిచేసే సీఆర్టీ విద్యార్థిని చిర్రుబుర్రు లాడినట్లు ఆ విద్యార్థి తండ్రి చెప్పుకొచ్చారు. అదే కేజీబీవీలో విద్యార్థులను కూడా నిత్యం ఓ టీచరు చీటికి మాటికి కొడుతుందని విద్యార్థులు చెప్పారని ఆ తండ్రి తెలిపారు. తాజాగ రెండు రోజుల కిందట విద్యార్థి తండ్రి కేజీబీవీ నుంచి అవసర నిమిత్తం విద్యార్థిని ఇంటికి తీసుకెళ్లి, ఆ తర్వాత కేజీబీవీకి తీసుకొస్తే ఆ విద్యార్థిని సీఆర్పీ కొట్టిందని విద్యార్థి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యార్థి పేరెంట్స్ సదరు సీఆర్పీతో గొడవకు దిగారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారుల మాత్రం తమకు ఏమీ పట్టనట్టు వ్యవహిస్తున్నారని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేసుస్తున్నారు.

జీసీడీవో పోస్టు కోసం జోరుగా పైరవీలు

కస్తూర్బా గాంధీ విద్యాలయాలను పర్యవేక్షించేందుకు జిల్లా విద్యా అధికారితో పాటు, ఇతర అధికారులు పర్యవేక్షిస్తుంటారు. ప్రధానంగా కేజీబీవీలో విద్యార్థులకు బోధన, భోజనం, సౌకర్యాలు అంశాలను పర్యవేక్షించేందుకు ఓ మహిళను లేదా 50 ఏళ్లు పైబడిన పురుషులను జీసీడీవో (జండర్ అండ్ ఇక్విటీ కోఆర్డినేటర్) నియమిస్తారు. వీరికి సమగ్రశిక్ష, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారు. ఎంపికైన వారు మూడేళ్ల పాటు పని చేసేందుకు అవకాశం ఉంది. వారి ఇష్టం లేకపోతే తప్పుకోవచ్చు. గతంలో పని చేసిన అధికారి ఆరు నెలల కింద ఈ పోస్టు నుంచి తప్పుకుంది. దీంతో ఖాళీ ఏర్పడింది.

ఈ పోస్టు కోసం కొందరు ఉపాధ్యాయులు జోరుగా పైరవీలు చేసుకుంటున్నారు. ఇందుకుపై అధికారులకు మామూళ్లు కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. మొత్తంగా కొత్తగా జీసీడీవోను కొత్తవారిని ఎప్పుడు నియమిస్తారన్న దనిపై ఉత్కంఠ నెలకొంది. జిల్లా విద్యాశాఖ అధికారి జీసీడీవో పోస్టు ఎవరు అర్హులన్నది పై అధికారుకుల రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఈ పోస్టు కోసం ఇద్దరు, ముగ్గురు పోటీ పడుతున్నట్లు తెలుస్తుంది.

పీయూ అధ్యాపకుడు సిరిగిరి గురుస్వామికి డాక్టరేట్



సిరిగిరి గురుస్వామికి డాక్టరేట్ పట్టాని అందిస్తున్న వైస్‌చాన్స్‌లర్

పాలమూరుయూనివర్సిటీ, జనవరి 2: పాలమూరు యూనివర్సిటీలో జువాలజీ అధ్యాపకుడు సిరిగిరి గురుస్వామికి ఉస్మానియా యూనివర్సిటీలో చేసిన పరిశోధనకుగాను పీహెచ్‌డీ పట్టా మంజూరైంది. "డైవర్సీ అండ్ ఎకాలజీ ఆఫ్ స్పైడర్ పానా ఇన్ డిఫరెంట్ ఆగ్రో ఎకో సిస్టమ్స్ ఆఫ్ మహబూబ్‌నగర్, తెలంగాణ" అనే అంశంపై ఓయూ ప్రొఫెసర్ మాధవి మార్గదర్శకత్వంలో చేసిన పరిశోధనకు గాను యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్ ప్రకటించింది. పెబ్బేరు మండలం చెలిమిల్లకు చెందిన వ్యవసాయకూలీలైన తల్లిదండ్రులు భీమన్న, మణెమ్మల కుమారుడు గురుస్వామి కష్టపడి చదివి డాక్టరేట్ సాధించారు. మంగళవారం పాలమూరుయూనివర్సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో డాక్టరేట్ సాధించిన సిరిగిరి గురుస్వామిని యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ అభినందించి, పీహెచ్‌డీ పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతినిరుపేద కుటుంబం నుంచి వచ్చిన గురుస్వామి ఎంతో కష్టపడి చదివారని ప్రశంసించారు. గురుస్వామి ఆదర్శంగా యువత, విద్యార్థులు చదవాలని చెప్పారు. ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గిరిజా మంగతాయారు, ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రకిరణ్, ఓయూ ప్రొఫెసర్ మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ బాస్కెట్ బాల్ టోర్నీకి కల్వకుర్తి క్రీడాకారుడు

- నేటి నుంచి ఈ నెల 7వరకు జాతీయ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బాస్కెట్ బాల్ టోర్నీ



రామచంద్రారెడ్డి

కల్వకుర్తి, జనవరి 2 : కల్వకుర్తి మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కుమారుడు ఎడ్మ రామచంద్రారెడ్డి బాస్కెట్ బాల్ క్రీడలో రాణిస్తూ కల్వకుర్తి పేరును జాతీయ స్థాయిలో విన్పించేలా చేశారు. బాస్కెట్ బాల్ క్రీడలో రాణిస్తూ తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సెయింట్ పాల్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న రామచంద్రారెడ్డి ఈ నెల 3 నుంచి 7వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయిపూర్ సమీపంలోని రాజ నందన్‌ఘావ్‌లో జరిగే 67వ స్కూల్స్ గేమ్స్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో అండర్14విభాగంలో తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్నారు. రామచంద్రారెడ్డి జాతీయ స్థాయిలో ఎంపిక కావడం పట్ల పలువురు క్రీడాకారులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చౌడూరులో గ్రానైట్ పనులు నిలిపి వేయాలి

- హైదరాబాద్‌లో కాలుష్య నియంత్రణ మండలి కమిషనర్‌కు ఫిర్యాదు



కమిషనర్ క్రిష్ణ ఆదిత్యకు ఫిర్యాదు చేస్తున్న చౌడూర్ గ్రామస్థులు

నవాబ్‌పేట, జనవరి 2 : గ్రామంలో పంట పొలాలను నాశనం చేస్తున్న క్రషర్ మిషన్ ఏర్పాటు పనులు వెంటనే నిలిపి వేయాలని మండలంలోని చౌడూరు గ్రామస్థులు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామానికి చెందిన రైతులు హైదరాబాద్‌లోని కాలుష్య నియంత్రణ మండలి కమిషనర్ కృష్ణ ఆదిత్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సమీపంలో క్రషర్ మిషన్ ఏర్పాటుతో తమ పంటపొలాల్లో దుమ్ము ధూళి వచ్చి, పంటలు నాశనమవుతున్నాయని పేర్కొన్నారు. క్రషర్ పనులు ఆపకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఆంజనేయులు, గోపాల్, సాయిలు, యాదగిరి, రాములు, భీమయ్య, వెంకటయ్య, జహంగీర్, నర్సింహులు, సుదర్శన్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

- వికసిత్ భారత్ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ పి. నరసింహరాజు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ నరసింహరాజు

చిన్నచింతకుంట, జనవరి 2 : పేదలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్కీములను ప్రజలు వినియోగించుకోవాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్, నోడల్ ఆఫీసర్ పి. నరసిం హరాజు ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని కురుమూర్తి, అల్లీపురం గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం ఆయన అధ్యక్షతన నిర్వహించారు. వికసిత్ భారత్ ముఖ్య ఉద్దేశం దేశం సాధించిన విజయాలను ప్రజలకు వివరించడానికి, సంక్షేమ పథకాలు అందరికీ చేరేలా వారిలో అవగాహన కల్పించటం కోసమేనని తెలిపా రు. కేంద్ర పథకాలైన ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, ప్రధానమంత్రి ఆవాస్‌యోజనా, కొత్తాయి కనెక్షన్‌లు, పీఎం జన్-ధన్ యోజనా, పీఎం సురక్షాయోజనా, పీఎం జీవనజ్యోతి బీమా యోజనా, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాల గురించి ప్రజలకు తెలవాల్సి ఉందని, తెలిపారు. ఎల్ఈడీ స్క్రీన్‌ద్వారా ప్రధాని మోదీ సందేశం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు ఆర్‌డీఓ సురేందర్, గ్రామ సర్పంచ్ రఘువర్ధన్‌గౌడు, కురుమూర్తితో పాటుగా స్థానికులు పాల్గొన్నారు.

ప్లాటు ఒక చోట.. నిర్మాణం మరోచోట

» చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలో ఇళ్ల అక్రమ నిర్మాణాలు

» కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు



జడ్పీ చైర్మన్‌కు ఫిర్యాదు చేస్తున్న చిన్నోనిల్లి గ్రామస్థులు

గట్టు, జనవరి 2 : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలంలోని చిన్నోనిపల్లి పునరావాస కేంద్రంలో ఇష్టానుసారంగా అక్రమ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని పలువురు గ్రామస్థులు మంగళవారం కలెక్టర్‌తో పాటు, జడ్పీ చైర్‌పర్సన్ సరితకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ప్లాటు ఒకచోట మంజూరైతే, ఇంటి ని ర్మాణం మరోచోట నిర్మిస్తున్నారని దీంతో ఇతర గ్రామస్థులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు రాఘవేంద్ర, వెంకటేష్, తిమ్మప్ప, వీరేష్, తాయప్ప, మహేశ్ తదితరులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ విషయంపై పంచాయతీ అధికారికి తెలిపినా పట్టించుకోవడం లేదని, అధికారులు స్పందించి చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాలను నిలిపి వేయాలని కోరారు. అదేవిధంగా గ్రామంలోని యువతకు ఇంతవరకు ప్లాట్లు మంజూరు చేయ లేదని, అర్హులను గుర్తించి వారికి ప్లాట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వెల్దండ, జనవరి 2 : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భైరాపూర్ గ్రామానికి చెందిన వరికుప్పల విష్ణు ట్రాక్టర్‌లో ఇసుకను వెల్దండకు తరలిస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు మాటు వేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ హెడ్‌కానిస్టేబుల్ మృతి

కల్వకుర్తి, జనవరి 2 : కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తి గ్రామానికి చెందిన శ్రీనివాసులు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్ మంగళవారం తెలిపారు. సోమవారం ఉదయం విధుల్లో ఉండగానే పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మాత్తుగా కింద పడిపోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



బాల్‌రాజు (ఫైల్)

చారకొండ, జనవరి 2: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో చోటుచేసుకొంది. ఎస్ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దండ మండల కేంద్రానికి చెందిన మల్లెపల్లి బాల్‌రాజు (28) మండల పరిధిలోని జూపల్లి శివారులో వెల్దండ మండలం లింగారెడ్డిపల్లి నుంచి జూపల్లి వరకు జియో నెట్ వర్క్ పనుల కోసం ఐరన్ స్తంభాలను పాతేందుకు వెల్దండ మండల కేంద్రానికి చెందిన సుధాకర్, రమేష్, ప్రవీణ్‌లతో కలిసి వెళ్లాడు. జియో నెట్‌వర్క్ పనుల్లో భాగంగా ఐరన్ స్తంభాలు పాతుతుండగా పైన ఉన్న విద్యుత్ వైర్లను బాల్‌రాజు గమనించకపోవడంతో విద్యుత్ షాక్‌కు గురై అపస్మారకస్థితికి చేరుకున్నాడు. అక్కడే పని చేస్తున్న వారు వెంటనే చికిత్సకోసం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ బాల్‌రాజు మృతి చెందాడు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, ఆరేళ్ల కూతురు ఉన్నది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా కర్రెమ్మ దేవత బోనాలు

మరికల్, జనవరి 2 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కర్రెమ్మ దేవత వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం బోనాలతో పురవీధుల గుండా ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ సర్పంచ్ లక్ష్మీ రామస్వామి, ఉప సర్పంచ్ శివకుమార్, మాసన్న, వెంకటయ్య, బాలప్ప పాల్గొన్నారు.

జోరుగా ధాన్యం విక్రయాలు

నారాయణపేట, జనవరి 2 : నారాయణపేట వ్యవసాయ మార్కె ట్ యార్డులో మంగళవారం ధాన్యం విక్రయాల జోరు కొనసాగింది. హంస ఐదు క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా, కనిష్ఠంగా రూ.2,450 పలికింది. సోనా 55 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.3,021, కనిష్ఠంగా రూ.2,851, రమారమిగా రూ.3,021, ఎర్ర కందులు 628 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.9,189, కనిష్ఠంగా రూ.7,700, రమారమిగా రూ.8,889, తెల్ల కందులు 94 క్వింటాళ్లు విక్రయానికి రాగా, క్వింటాలుకు ధర గరిష్ఠంగా రూ.9,439, కనిష్ఠంగా రూ.8,000, రమారమిగా రూ.9,291 పలికింది.

11 కేవీ లైన్‌ను తొలగించాలి

మాగనూరు, జనవరి 2 : మండలంలోని తాళంకేరి గ్రామం మధ్యలో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్‌ను తొలగించి, గ్రామం బయట నుంచి తీసుకెళ్లాలని కోరుతూ మంగళవారం 'ప్రజాపాలన' కార్య క్రమంలో కరెంటు లైన్‌మెన్ సంజీవ్‌కు స్థానికులు వినతి పత్రం అందించారు. ఊరు మధ్యలో 11 కేవీ విద్యుత్ లైన్ ఉండటం వల్ల వర్షా కాలంలో సమస్యలు తలెత్తుతున్నాయని, అదే విధంగా పొలాల వెంట ఉన్న 33 కేవీ లైన్ సమస్యకు కూడా పరిష్కరించాలని కోరారు.

6న హైదరాబాద్‌లో మాలమహానాడు రాష్ట్ర సమావేశం

పాలమూరు, జనవరి 2 : జనవరి 6వ తేదీన మాలమహానాడు రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా అద్దంకి దయాకర్ హాజరవుతారని తెలిపారు. సంఘం భవిష్యత్ కార్యక్రమాలు, నూతన జిల్లా , మండల కమిటీలు ఎన్నిక తదితర విషయాలను చర్చిస్తామని వివరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు గండీటి చిన్న, సత్తయ్య, బి.ఆరేందర్, వి.ఆంజనేయులు, రవికుమార్ పాల్గొన్నారు.

అనుమతుల పేరుతో ఇసుక అక్రమంగా డంపింగ్

- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీంద్రారావు

ఉప్పునుంతల, జనవరి 2: అనుమతుల పేరుతో ఇసుకను అక్రమంగా డంపింగ్ చేస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీంద్రరావు మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని మొల్గర గ్రామ శివారులో దుందుభీ వాగు నుంచి ఇసుకను టిప్పర్లు ద్వారా తరలి స్తున్నారని పేర్కొన్నారు. విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకపోయినా పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.



గ్రామ శివారులో ఇసుక డంపు చేస్తున్న టిప్పరు


జడ్చర్లలో పెట్రోల్ బంకు వద్ద బారులు తీరిన వాహనదారులు

పెట్రోల్‌బంకులు కిటకిట

జడ్చర్ల/ భూత్పూర్/ నవాబ్‌పేట, జనవరి 2 : ట్రక్కు డ్రైవర్లు సమ్మెకు పిలుపునివ్వడంతో వాహనదారులు పెట్రోల్‌బంక్‌కు బారులు తీరారు. కేంద్రప్రభుత్వం కొత్త న్యాయచట్టం తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. రోడ్లపై వాహనాలను ఢీకొట్టిన తరు వాత చాలామంది డ్రైవర్లు వాహనం ఆపకుండా పరారవుతుండటంతో ఇకపై ఎవరైన రోడ్డు ప్రమాదం చేస్తే సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇవ్వకుం డా పరారైతే (హిట్‌అండ్‌రన్)వారిపై పదేళ్ల జైలుశిక్ష రూ.7 లక్షల జరిమానా విధించాలని తీసుకువచ్చిన న్యాయచట్టాలను నిరసిస్తూ ట్రక్కు డ్రైవర్లు మూడ్రోజుల సమ్మెకు పిలుపు నిచ్చినట్లు ప్రచారం జరగడంతో వాహనదారులు పాలమూరులో మంగళవారం మధ్యాహ్నం నుంచే బంక్‌ల వద్దకు బారులు తీరారు. బంకుల్లో డీజిల్, పెట్రోల్ స్టాక్ అయిపోతే వాహనాలు మూడ్రోజులు నడిచే పరిస్థితి లేనందున పెద్దఎత్తున వాహనదారులు పెట్రోల్‌బంక్‌లకు పరుగులు తీయడంతో గంటలపాటు క్యూలో వెయిట్ చేయాల్సి వస్తున్నది. కొందరు పెట్రోల్‌బంక్ నిర్వహకులు మాత్రం స్టాక్‌కు ఇబ్బంది లేదని, వాహనదారులు ఆందోళన చెందవద్దని చెబుతున్నారు. ఎలాంటి ధర్నా కార్యక్రమాలు చేపట్టడంలేదంటూ తెలంగాణ ఆయిల్ ట్యాంకర్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ మంగళవారం ప్రకటనలో సోషల్ మీడియాలో వచ్చిన పుకార్లకు ఫుల్‌స్టాప్ పడినట్లయ్యింది.

ఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు



జిల్లా పోలీసు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్, జనవరి 2 : జిల్లాపోలీసు కార్యాలయంలో మంగళవారం పోలీసులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఎస్పీ హర్షవర్ధన్ కేక్ చేశారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గడిచిన ఏడాదిలో పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు ఎంతో కృషిచేశారన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కేసులు ఛేదించారన్నారు. నూతన సంవత్సరంలో నిర్దిష్ట లక్ష్యాలను పెట్టుకుని ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అదనపుఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ మహేశ్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

అల్వాల్‌రెడ్డి కుటుంబానికి పరామర్శ


అల్వాల్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి

మిడ్జిల్, జనవరి 2 : కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అల్వాల్‌రెడ్డి పెద్ద కుమారుడు భానుప్రకాశ్‌రెడ్డి సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డిలు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండి కుటుంబ సభ్యులకు మరింత ధైర్యాన్ని ఇవ్వాలని అల్వాల్‌రెడ్డికి వివరించారు. వారి వెంట మాజీ జడ్పీటీసీ రబ్బాని, ఎంపీటీసీ గౌస్, రూరల్‌సీఐ జములప్ప, నాయకులు వెంకటయ్య, సాయులు, ఉస్మాన్, నర్సింములు గుప్తా, జహీర్, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, మణికంఠలతో పాటు తదితరులున్నారు.

● ప్రజల వద్దకే పాలన : మండలంలోని వస్పుల గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి పాల్గొన్నారు. మొదట గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్రంలోని పేద ప్రజలకు నాణ్యమైన పరిపాలన అందించే దిశగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. అనంతరం గ్రామంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు వంశీచంద్‌రెడ్డి, అనిరుద్‌రెడ్డిలను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

దేవరకద్ర ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు

రాజాపూర్, జనవరి 2 : మండల కేంద్రంలోని ముఖ్యకూడలిలో మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. నాయకులు కండువాతో, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో గోనెల రమేష్, గోవర్ధన్‌రెడ్డి, రమణ, మహేందర్, సజీర్ బైగ్, రాము, శ్రీశైలం పాల్గొన్నారు.

రామయ్య అక్షింతలు ఇంటికి రావడం మన అదృష్టం

- మునిసిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్


ఇంటింటా శ్రీరాముని అక్షింతల పంపిణీని ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్మన్

భూత్పూర్, జనవరి 2 : అయోధ్య శ్రీరాముని అక్షింతలు మన ఇంటికి రావడం మనందరం చేసుకున్న పుణ్యమని మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్ అన్నారు. మంగళవారం మునిసిపాలిటీలోని 10వ వార్డులో అయోధ్య నుంచి వచ్చిన రాముని అక్షింతలను ఇంటింటా వితరణ కార్యక్రమాన్ని మునిసిపల్ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నారాయణగౌడ్, ఆంజనేయస్వామి దేవాలయ భజన భక్తమండలి అధ్యక్షుడు ఎస్. కృష్ణయ్యగౌడ్, భజన మండల భక్తులు సాయిలు, శ్యాంసుధరాచారి, గడ్డం శ్రీనివాసులు, పరశురాం, విజయ్‌కుమార్, ప్రణీత్‌కుమార్, నర్సిములు, తిరుపతయ్యగౌడ్, టీ.నరేందర్‌గౌడ్, విశ్వహిందూ పరిషత్ మాతృమండలి మహిళలు పాల్గొన్నారు.

శ్రీరాముడి అడుగుజాడలో నడవాలి

దేవరకద్ర : ధర్మానికి ప్రతిరూపం శ్రీరాముడు అని, సమాజంలో ప్రతీ ఒక్కరు ఆయన అడుగుజాడలో నడవాలని బీజేపీ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం నుంచి శ్రీరామ జన్మభూమి అంక్షింతల శోభాయాత్రను ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ శ్రీరాముడి అంక్షితలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చంద్రయ్య, నరేష్‌కుమార్, లక్ష్మీకాంత్‌రెడ్డి నరసింహారెడ్డి, కొండశ్రీను, తిప్పరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నాగ్గిరెడ్డి పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

గండీడ్ : మండల పరిధిలోని వెన్నాచేడ్ గ్రామంలో మంగళవారం ఇంటింట అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జి.రాములు, శివమల్లప్ప, రాములు, నాగేంద్రకుమార్, అంజిలయ్య, చంద్రయ్య, నరేందర్, వెంకటయ్య పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇబ్బంది కలిగించొద్దు


ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

● అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్
● ధర్మాపూర్ తువ్వగడ్డతండాలో దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ రూరల్, జనవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభయహస్తం ప్రజల వద్దకు పాలన (ప్రజాపాలన) సదస్సు కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని ధర్మాపూర్, తువ్వగడ్డ తండా గ్రామాల్లో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ రవి నాయక్, ధర్మాపూర్‌లో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దరఖాస్తుల స్వీకరించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జ్యోతి, తహసీల్దార్ సుంధర్‌రాజ్, ఎంపీవో నరేందర్‌రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

● బాలానగర్ : మండలంలోని ఉడిత్యాల గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమాన్ని మంగళవారం అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ పరిశీలించారు. ప్రజాపాలనకు వచ్చిన లబ్ధిదారుల నుంచి తీసుకుంటున్న దరఖాస్తులలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరిష్కరించే బాధ్యతతో పని చేయాలని సూచించారు. ఎంపీడీవో కృష్ణారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● హన్వాడ : ప్రజలు ఇచ్చే అన్ని దరఖాస్తులను తీసుకుంటామని ఎవరూ ఎలాంటి ఇబ్బంది పడవద్దని ఎంపీడీవో ధనుంజయగౌడ్ కోరారు. మంగళవారం మండలంలోని మాదారం, నాగంబాయితండా గ్రామాలలో తహసీల్దార్ కిష్టానాయక్ టీం, కిష్టంపల్లి, అయోధ్యనగర్ గ్రామంలో ఎంపీడీవో ధనుంజయగౌడ్ టీం, కారంతండా, బుద్దారం గ్రామాలలో ఎంపీవో వెంకట్‌రెడ్డి టీంలు సభలు నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇప్పటికే 6250 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఆయా గ్రామాలలో సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ స్థాయి సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

● అడ్డాకుల : మండల పరిధిలోని గుడిబండలో మంగళవారం మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ ప్రజాపాలన దరఖాస్తుల సేకరణను పరిశీలించారు. దరఖాస్తులు ఇవ్వడానికి వచ్చేవారికి మంచి నీటి వసతి ఏర్పాటు చేయాలని సూచించారు. అందరికీ దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎంపీడీవో మంజుల, సర్పంచు భాస్కర్, ఎంపీటీసీ శకుంతల పాల్గొన్నారు.

● దేవరకద్ర : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల పథకాలను అర్హులందరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోయిల్‌సాగర్, అజిలాపూర్, నాగారం, పెద్దరాజమూర్ గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలో భాగంగా ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల దగ్గర ఏర్పాటు చేసిన సభలో ప్రజల నుంచి ఆరు గ్యారెంటీలను స్వీకరిస్తున్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిరాక్స్ సెంటర్లలో ఆరు గ్యారెంటీల ఫారాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.శ్రీనివాసులు విలేకర్ల సమావేశంలో తెలిపారు.

● గండీడ్ /మహమ్మదాబాద్ : గండీడ్, మహమ్మదాబాద్ మండలాల్లో ప్రజాపాలన సభలు కొనసాతున్నాయి. గండీడ్ మండల టీం లీడర్లు తహసీల్దార్ నాగలక్ష్మి, విద్యాధికారి వెంకటయ్య ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. మహమ్మదాబాద్ మండలంలో టీం లీడర్లు ఎంపీవో శంకర్‌నాయక్, చత్రునాయక్ పాల్గొని దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

ప్రజల చెంతకే ప్రజా పాలన : పరిగి ఎమ్మెల్యే

నవాబ్‌పేట : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సిద్ధంగా ఉందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కన్మన్‌కాల్వ గ్రామంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆరు గ్యారెంటీల అమలుతో పేదల ముఖాల్లో సంతోషం చూడాలన్నదే తమ ముఖ్యంత్రి ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీ అంబిబాయి, మండల అధ్యక్షుడు అశోక్, సుదర్శన్‌రెడ్డి, సాకల్ పల్లి శేఖర్, ఖాదర్, మొగుళ్లపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.


కారం తండాలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపివో వెంకట్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి

విద్య, వైద్యం, ఉపాధి కల్పనే లక్ష్యం

● బాసరా ట్రిపుల్‌ఐటీ తరహాలో విద్యాకేంద్రం ఏర్పాటుకు కృషి
● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టీకరణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జనవరి 2 : తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున విద్య, వైద్యం, ఉపాధి కల్పనే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఫ్లెక్సీలతో అభిమానులు, కార్యకర్తలు హడావిడి చేయవద్దని, ఈ సంస్కృతిని తగ్గించాలని కోరారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాసరా ట్రిపుల్ ఐటీ తరహాలో పాలమూరు విద్యాకేంద్రం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తామని, ఇప్పటికే ముఖ్యమంత్రికి విన్నవించామన్నారు. అదేవిధంగా మహిళా డిగ్రీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాలలను తీసుకురావాల్సి ఉందని తెలిపారు. వైద్య పరంగా ప్రస్తుతం ఉన్న జనరల్ ఆసుపత్రి స్థాయి పెంచి సూపర్‌స్పెషాలిటీగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తామని వెల్లడించారు. ఐటీటవర్‌లో స్పేస్ ఉందని, కంపెనీలే లేవని అక్కడ నాణ్యమైన కంపెనీలు తీసుకువచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. జిల్లాలో డబుల్‌బెడ్‌రూమ్ విషయంలో అవకతవకలు జరిగాయని వీటిపై విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 523 సర్వే నెంబర్‌లో అప్పట్లో కాంగ్రెస్ పేదలకు పట్టాలిచ్చిందని, పట్టాలున్నవారికి ముందుగా డబుల్‌బెడ్‌రూమ్‌లు ఇచ్చిన తరువాత స్థలం ఉంటే అర్హులకిస్తామ ని వివరించారు. ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసిందని, మొత్తం నాకేసిందని విమర్శించారు. 12 నెలలకు ఉపయోగించాల్సిన బడ్జెట్‌ను 8 నెలలకే ఖతం చేసిందని, వాటన్నింటిని సరిదిద్దుకుని తొందరలోనే సంక్షేమ పథకాలన్ని అమలు చేస్తామని స్పష్టం చేశారు. కాళేశ్వరం పేరిట ప్రభుత్వం రూ.లక్షా 30 వేల కోట్లు గంగపాలు చేసిందని, ఇంత దారుణం చేసిన నాయకులను ఇతర దేశాలలో బహిరంగ ఉరితీస్తారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎం.సురేందర్‌రెడ్డి, సిరాజ్‌ఖాద్రి, సిజె బెనహర్, లక్ష్మణ్‌యాదవ్ పాల్గొన్నారు.

మన్నె కుటుంబానికి పరామర్శ


నివాళ్లు అర్పిస్తున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

నవాబ్‌పేట, జనవరి 2 : మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి సోదరుడు, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ జీవన్‌రెడ్డి తండ్రి మన్నె వెంకట్రామిరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మన్నె కుటుంబాన్ని పలువురు రాజకీయ ప్రముఖులు పరామర్శించారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, సీఎం రేవంత్ సోదరుడు కృష్ణారెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, దేవరద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, సీడబ్ల్యూసీ మెంబర్ చల్లా వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ మంత్రులు వి.శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, గిరిజన కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాల్యా నాయక్, పీసీసీ అధికార ప్రతినిధులు హర్షవర్ధన్‌రెడ్డి, జహీర్‌అక్తర్, బుర్రి వెంకట్రామిరెడ్డి, పీ.రంగారావు, జూపల్లి భాస్కర్ రావు, జడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నవాబ్‌పేట జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ యువనేత అభిమన్యురెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ మాడెమోని నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య, మాజీ చైర్మన్ రాంప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణగౌడ్, మాజీ వైస్ చైర్మన్లు భూపాల్ రెడ్డి, చందర్ నాయక్, సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, యాదయ్య, వెంకటేష్, బంగ్ల రవి, నర్సింహచారి, మండల ఉపాధ్యక్షుడు హమీద్, నాయకులు యన్మనగండ్ల లక్ష్మయ్య, కొల్లూర్ రాజు, కారుకొండ భూపాల్‌రెడ్డి, కామునిపల్లి శేఖర్‌రెడ్డి, రవీందర్ గౌడ్, మక్సూద్, ఎండీ రియాజ్, రాజు, రాజశేఖర్, నర్సింహులు, సున్నాల కృష్ణయ్య, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అయోధ్యలో రామమందిర నిర్మాణం చారిత్రాత్మక ఘట్టం


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమార్

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), జనవరి 2 : అయోధ్యలో భవ్యశ్రీ రామమందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఈ నెల 22న జరగనుందని, ఇది చరిత్రాత్మక ఘట్టమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమార్ అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అయోధ్య రామ మందిరంలో బాలరాముని విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరగనుందని తెలిపారు. ఆ రోజు శ్రీరామున్ని దర్శించుకోవడం అందరికీ కుదరదని, మన ఇంట్లోనే ఐదు రామ జ్యోతులను వెలిగించి, దీపావళి పండగలా యావత్ ప్రపంచం చేసుకోవాలని ప్రధాని విజ్ఞప్తి చేశారని ఆయన గుర్తుచేశారు. అయోధ్యలో జరగనున్న కార్యక్రమాలు టీవీల ద్వారా వీక్షిస్తూ, కార్యక్రమంలో పాల్గొన్నట్లుగా భావించాలని ఆయన సూచించారు. గ్రామ గ్రామాన, ప్రతీ గడపకు అయోధ్య పూజిత అక్షింతలు చేర నున్నాయని, ఆరోజు జరిగే కార్యక్రమం అనంతరం అక్షింతలు ప్రతీ ఒక్కరు తలపై వేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను తీసుకువచ్చారని గుర్తు చేశారు. మళ్లీ బీఆర్ఎస్ గెలిస్తే ఏమవుతుందోనన్న భయంతో ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించారని గుర్తు చేశా రు. ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ పోరాడుతుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో మీడియా లేవనెత్తిన ప్రశ్నకు స్పందిస్తూ పాలమూరు ఎంపీగా తనకే అవకాశం ఉందని, ఆశావాదులకు ఇచ్చిన అవకాశాలను వారు ఇదివరకే వినియోగించుకున్నారని తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా కోసం దరఖాస్తు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జనవరి 2 : అసంఘటిత రంగాల్లో పనిచేస్తూ ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకొని ప్రమాదవశాత్తు చనిపోయినా, అంగవైకల్యం పొందిన కార్మికులు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖకు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ అధికారులు కోరుతున్నారు. ఈ మేరకు కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఎం. యాదయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద 2022 మార్చి 31 వరకు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకొని చనిపోయిన కార్మికుల నామినీలకు రూ.2 లక్షలు, అంగవైకల్యం పొందిన కార్మికుల నామినీలకు రూ.లక్ష అందిస్తారని ఆయన తెలిపారు. అర్హులైన వారు ఈ ఎక్స్‌గ్రేషియా తీసుకునేందుకు గాను 2024 ఫిబ్రవరి 23 లోపు కలెక్టరేట్‌లో ఉన్న సహాయ కార్మిక కమిషనర్‌కు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఆయన తెలిపారు.

అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- యూనాని వైద్యుడు డాక్టర్ జహీరొద్దీన్


భూత్పూర్‌లో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జహీరొద్దీన్

భూత్పూర్, జనవరి 2 : అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రతినిత్యం పరిసరాలతో పాటు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని మండల యూనాని వైద్యాధికారి డాక్టర్ జహీరొద్దీన్ సూచించారు. మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన యూనాని ఆరోగ్య శిబిరంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రోగులకు ఆయన వైద్యపరీక్షలు చేశారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడుతున్న వారికి, అదే విధంగా దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి యూనాని(ఆయుర్వేద) మందులను అందించారు. ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో సీజనల్ అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని, తగ్గిపోయిదనుకున్న కరోనా మళ్లీ చాప కింద నీరులా ప్రబలుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన రోగులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి నామ స్మరణతో మార్మోగిన భూత్పూర్

భూత్పూర్, జనవరి 2 : కఠిన నియమాలు పాటించి, నిత్య పూజలు చేసి 40 రోజులపాటు అయ్యప్పను కొలచిన మాలధారణ స్వాములు మంగళవారం శబరికి బయలుదేరారు. శబరి యాత్రకు వెళ్తున్న శుభ సందర్భంగా అయ్యప్ప గురుస్వామి రఘుపతి శర్మ స్థానిక మునిరంగ స్వామి దేవాలయం ఆవరణలో శబరి యాత్ర అయ్యప్ప స్వాములకు ఇరుముడులను కట్టి పంపించారు. వారి కుటుంబ సభ్యులు భక్తి శ్రద్ధలతో మాలధారణ స్వాములకు పూలమాలలు వేసి పాదపూజ చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి మాలధారణ స్వాములు, గురుస్వాములు పాల్గొన్నారు.


మృతుని చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జడ్పీటీసీ కుటుంబ సభ్యులకు పరామర్శ

మహబూబ్‌నగర్ రూరల్, జనవరి 2 : మహబూబ్‌నగర్ రూరల్ మండలం పుల్లూరు వెంకటేశ్వరమ్మ కుటుంబసభ్యుడు దశరథ్‌రెడ్డి మరణించడంతో మంగళవారం మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిలు నివాళ్లర్పించారు. మండలంలోని ఓబులాయిపల్లిలో మృతుని నివాసానికి చేరుకున్న ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జడ్పీటీసీని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రాఘవేందర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

● మాజీకౌన్సిలర్‌కు పరామర్శ : అనారోగ్యంతో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న మాజీకౌన్సిలర్ పల్లవిని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పట్టణంలోని ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు.

'రాంరెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలి'

మహబూబ్‌నగర్ (క్లాక్ టవర్), జనవరి 2 : మహబూబ్ నగర్ మైనారిటీ గురుకుల రెసిడెన్సియల్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతూ జనవరి 31న అర్ధరాత్రి ఉరేసుకొని చనిపోయున రాంరెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని, కుటుంబ సభ్యులకు రూ.ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించాలని భారతీయ జనతాపార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండలం బూనేడు గ్రామానికి చెందిన హన్మంతు రెడ్డి కుమారుడు రాంరెడ్డి పాలమూరు పట్టణంలోని మైనారిటీ గురుకుల కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతూ డిసెంబరు 31న తెల్లవారు జామున 3.30 గంటలకు అదేహాస్టల్‌లో ఉరేసుకొని చనిపోయాడని దీనికి గురుకుల హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమేనని అన్నారు. దీనిపై సీఎం రేవంతరెడ్డి తక్షణం స్పందిస్తూ రాంరెడ్డి కుటుంబాన్ని ఆదుకోవాలని, వారి కుటుంబంలో కాంట్రాక్ట్ పద్ధతిన ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని ఆమె డిమాండ్ చేశారు.

నేడు సావిత్రీబాయి పూలే జయంతి

పాలమూరు, జనవరి 2 : సావిత్రిబాయి పూలే జయంతిని 3వ తేదీ బుధవారం జిల్లా కేంద్రంలోని పాతతోటలో నిర్వహిస్తున్నట్లు అంబేద్కర్ జాతర ఉమ్మడి జిల్లా కమిటి అధ్యక్ష, కార్యనిర్వాహక అధ్యక్షులు రాయికంటి రాందాసు, సింగిరెడ్డి పరమేశ్వర్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మునిసిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు హాజరవుతారని వివరించారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రాజకీయ సంక్షోభంలో సీపీఐ నేత ఏబీ బర్ధన్ పాత్రకీలకం

- పార్టీ జిల్లా సమితి కార్యదర్శి బి.బాలకిషన్


ఏ.బీ బర్ధన్‌కు నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

పాలమూరు, జనవరి 2 : భారత దేశంలో రాజకీయ సంక్షోభంలో సీపీఐ జాతీయ నాయకులు ఏ.బి బర్ధన్ పాత్ర కీలకమని ఆ పార్టీ జిల్లా సమితి కార్యదర్శి బి.బాలకిషన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఏ.బి బర్ధన్ 7వ వర్ధంతి సందర్భంగా నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1924లో ఉమ్మడి భారత దేశం, నేడు బంగ్లాదేశ్‌లో జన్మించారని, 15వ ఏటనే ఏఐఎస్ఎఫ్‌లో చేరి విద్యారంగ సమస్యలపై రోరాటం చేశారన్నారు. 1940లో సీపీఐలో చేరి 1957లో మహారాష్ట్ర నాగపూర్‌లో శాసనసభ్యులుగా 1969, 1980లో నాగపూర్ నుండి లోక్‌సభ సభ్యులుగా ఎన్నికై ప్రజా, కార్మిక సమస్యలపై పోరాడారన్నారు. 1990లో సీపీఐ జాతీయ ఉప ప్రధాన కార్యదర్శిగా, 1996లో కాంగ్రెస్,బీజేపీ యేతర పార్టీలు కాదని థర్డ్ ప్రంట్ (మూడో కూటమి) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయ సాధనకోసం మనం పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ్యులు బి.రాము, చాంద్‌పాషా, లక్ష్మణ్, రాజశేఖర్, ఏ.రమేష్, బి.రమేష్, పవన్‌కుమార్‌రెడ్డి, రమేష్, శేఖర్, రఘులు పాల్గొన్నారు.